యువ భారత్ జట్టులోకి అవినాశ్, అభిషేక్

అండర్-19 ఆసియాకప్ టోర్నీలో హైదరాబాదీలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: యూఏఈ వేదికగా జరిగే అండర్-19 ఆసియాకప్ టోర్నీకి ఎంపిక చేసిన భారత జట్టులో హైదరాబాద్‌కు చెందిన అవినాశ్‌రావు, మురుగన్ అభిషేక్ ఎంపికయ్యారు. వచ్చే నెల 8వ తేదీ నుంచే మొదలయ్యే టోర్నీ కోసం సెలెక్టర్లు శనివారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. యువ భారత జట్టుకు ఉదయ్ శరణ్ కెప్టెన్‌గా, వైస్‌కెప్టెన్‌గా స్వామి కుమార్ పాండే వ్యవహరించనున్నారు. గత కొంత కాలంగా వికెట్‌కీపర్, బ్యాటర్ అవినాశ్, అభిషేక్ నిలకడగా రాణిస్తూ వస్తున్నారు. వీర్దిదరి ప్రదర్శనను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకున్నారు. అండర్-19 ఆసియాకప్ టోర్నీని అత్యధికంగా ఎనిమిది సార్లు గెలిచిన భారత్ మరోమారు టైటిల్ ఫెవరేట్‌గా బరిలోకి దిగుతున్నది. భారత్‌కు ఎంపికైన అవినాశ్, అభిషేక్‌ను హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ప్రత్యేకంగా అభినందించారు.

భారత అండర్-19 టీమ్: ఉదయ్ శరణ్ (కెప్టెన్), అవినాశ్‌రావు, అభిషేక్, కుమార్ పాండే, అర్శిణ్ కులకర్ణి, ఆదర్శ్ సింగ్, రుద్ర మయూర్, సచిన్‌దాస్, ప్రియాంశు, ముశీర్ ఖాన్, దనుశ్‌గౌడ, , ఇన్నేశ్ మహాజన్, ఆరాధ్యశుక్లా, రాజ్ లింబాని, నమన్ తివారీ.

నిశ్క పసిడి మెరుపులు

అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తాష్కెంట్ (ఉజ్బెకిస్థాన్) వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ టోర్నీలో రాష్ట్రానికి చెందిన యువ జిమ్నాస్ట్ నిశ్క అగర్వాల్ పసిడి పతకంతో మెరిసింది. శనివారం జరిగిన బాలికల జూనియర్ టేబుల్ వాల్ట్ విభాగంలో భారత్ తరపున బరిలోకి దిగిన నిశ్క అద్భుత ప్రదర్శన కనబరుస్తూ అగ్రస్థానంలో నిలిచింది. బాలికల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో నిశ్క మూడో స్థానంతో కాంస్యం ఖాతాలో వేసుకుంది.

ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడి

చైనా మాస్టర్స్ టోర్నీ

షెన్‌జెన్ : భారత బ్యాడ్మింటన్ జోడి సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ టోర్నీ ఫైనల్స్‌కు చేరుకుంది. శనివారం సెమీఫైనల్స్‌లో భారత జోడి చైనాకు చెందిన టింగ్-రెన్ జియాంగ్ యులను 21-15, 22-20 స్కోరుతో 50 నిమిషాలలో ఓడించి టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఫైనల్లో వారు మరో సెమీస్‌లో తలపడే రెండు చైనా జట్ల మధ్య విజేతతో ఆదివారం ఢీకొంటారు. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకున్న భారత జోడి రెండో గేమ్‌లో చైనా ద్వయం నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్నది. ప్రతి పాయింట్ కోసం సాత్విక్-చిరాగ్ చెమటోడ్చారు. హోరాహోరీ సాగిన పోరులో చివరకు భారత జోడినే విజయం వరించింది. టాప్ సీడ్‌గా టోర్నీలో బరిలోకి దిగిన సాత్విక్-చిరాగ్ తమ సీడింగ్‌కు న్యాయం చేకూర్చుతూ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ యేడాది ఆసియన్ బ్యాడ్మింటన్ టోర్నీ, ఇండోనేషియా సూపర్ 1000 టోర్నీ, కొరియా సూపర్ టోర్నీ, స్విస్ టోర్నీతో పాటు ఆసియన్ గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకుని సూపర్ ఫామ్‌లో కొనసాగుతున్న భారత జోడి, ఇదే జోరుతో చైనా మాస్టర్స్ టైటిల్‌ను కూడా దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నది.

జోరు సాగనీ..

నేడు భారత్, ఆస్ట్రేలియా రెండో టీ20 • సాయంత్రం 7.00 నుంచి

వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓటమి అనంతరం ఆడిన తొలి టీ20లో విజయం సాధించిన టీమ్‌ఇండియా.. అదే జోరు కొనసాగించేందుకు సిద్ధమైంది. వైజాగ్‌లో రికార్డు స్కోరు చేజ్ చేసిన యువభారత జట్టు.. నేడు ఆస్ట్రేలియాతో రెండో టీ20లో తలపడనుంది. బ్యాటింగ్‌లో జట్టుకు పెద్దగా ఇబ్బందులు లేకపోయినా.. బౌలింగ్‌లో మరింత రాణించాలని భారత్ భావిస్తుంటే.. సిరీస్ సమం చేయాలని కంగారూలు కాచుకు కూర్చున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కేరళపై అధికంగా ఉండటంతో.. మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది!

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, ఇషాన్, తిలక్, రింకూ, అక్షర్, రవి, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్, ముఖేశ్.

ఆస్ట్రేలియా: వేడ్ (కెప్టెన్), స్మిత్, షార్ట్, ఇంగ్లిస్, స్టొయినిస్, డేవిడ్, హార్డీ, అబాట్, ఎలీస్, బెరన్‌డార్ఫ్, తన్వీర్.

తిరువనంతపురం: సీనియర్ల గైర్హాజరీలో యువ ఆటగాళ్లతో నిండిన భారత జట్టు.. ఆస్ట్రేలియాతో రెండో టీ20కి రెడీ అయింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన తొలి టీ20లో ఘనవిజయం సాధించిన సూర్యకుమార్ సేన.. ఆదివారం తిరువనంతపురంలో ఆసీస్‌తో మరోసారి తలపడనుంది. స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్ తుదిపోరులో ఆస్ట్రేలియా చేతిలో భంగపడ్డ టీమ్‌ఇండియా.. వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్‌కప్ కోసం ఇప్పటి నుంచే కసరత్తులు ప్రారంభించింది. పొట్టి ప్రపంచకప్‌లో యువ ఆటగాళ్లకు అవకాశమివ్వాలనుకుంటున్న మేనేజ్‌మెంట్.. ఈ సిరీస్‌లో వాళ్లకు విరివిగా అవకాశాలు ఇస్తున్నది. మెగాటోర్నీకి ముందు భారత జట్టు ఈ ఫార్మాట్‌లో మరో 10 మ్యాచ్‌లు మాత్రమే ఆడనుండటంతో.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఆటగాడు ఆశిస్తున్నాడు. అయితే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉండటం అభిమానులను కలవరపెడుతున్నది. టీమ్‌ఇండియా గత మ్యాచ్‌లో ఆడిన 11 మందితోనే బరిలోకి దిగే అవకాశాలున్నాయి. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ ఓపెనింగ్ చేయనుండగా.. ఇషాన్ కిషన్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు రానున్నాడు. ఆ తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, రింకూసింగ్‌తో మిడిలార్డర్ పటిష్టంగా ఉంది. ఉత్కంఠ రేపిన వైజాగ్ మ్యాచ్‌లో రింకూ సింగ్ చివరి వరకు నిలిచి తనలో మంచి ఫినిషర్ ఉన్నాడని నిరూపించుకోగా.. అక్షర్ పటేల్ అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో రాణించాల్సి ఉంది. బౌలింగ్ విషయానికి వస్తే.. ముఖేశ్ కుమార్ డెత్ ఓవర్స్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, రవి బిష్ణోయ్ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో లోపాలు సరి చూసుకునే బరిలోకి దిగాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నది. మరోవైపు ఆస్ట్రేలియా కూడా భారీ బలగంతో శత్రుదుర్భేద్యంగా కనిపిస్తున్నది. సెంచరీ హీరో ఇంగ్లిస్‌తో పాటు స్మిత్, షార్ట్, స్టొయినిస్, డేవిడ్, వేడ్‌ను ఈ మ్యాచ్‌లో ఆపడం కష్టమే.

పిచ్, వాతావరణం

ఈ పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేయడం కష్టం. ఇక్కడ జరిగిన మూడు టీ20 మ్యాచ్‌ల్లో చేజింగ్ చేసిన జట్టే గెలిచింది. టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపనుంది. ఆకాశం మేఘావృతమై ఉండనుంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది.

'రింకూ నుంచి నేర్చుకుంటున్నా'

తిరువనంతపురం: ఆస్ట్రేలియాతో తొలి టీ20లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ.. నయా ఫినిషర్ రింకూ సింగ్ నుంచి టెక్నిక్స్ నేర్చుకుంటున్నానని అంటున్నాడు. ఉత్కంఠ సమరాల్లో చివరి వరకు నిలిచి జట్టును ఎలా గెలిపించాలో.. అతడు చక్కగా చేసి చూపుతున్నాడని తిలక్ అన్నాడు. ఐపీఎల్లో ముంబై తరపున కీలక ఇన్నింగ్స్‌లు ఆడటంతో పాటు.. జాతీయ జట్టుకు ఎంపికైన తొలి టోర్నీలోనే సత్తాచాటిన తిలక్ మ్యాచ్‌లను విజయవంతంగా ముగించడం ముఖ్యం అని చెప్పాడు. 'ఆట ఆఖరి ఓవర్లలో ఎలా ఆడాలో రింకూ నుంచి నేర్చుకుంటున్నా. జాతీయ జట్టు కోసం నిలకడైన ప్రదర్శనే చేయడమే నా లక్ష్యం. రానున్న మ్యాచ్‌ల్లో చేసి చూపుతాననే నమ్మకముంది. నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. గత మ్యాచ్‌లో లెగ్ స్పిన్నర్‌ను లక్ష్యంగా చేసుకొని భారీ షాట్లు ఆడాలనుకున్నా. కానీ అది సాధ్యపడలేదు. సూర్యకుమార్ సారథ్య సామర్థ్యంపై నమ్మకముంది' అని తిలక్ వివరించాడు.

తెలంగాణ 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో గారపాటి శ్రీజని (రంగారెడ్డి) మూడు పతకాలతో మెరిసింది. బాలికల అండర్-17 విభాగం 200మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో శ్రీజని 2:47:58సె టైమింగ్‌తో అగ్రస్థానంతో పసిడి దక్కించుకుంది. అదే జోరు కొనసాగిస్తూ 100మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 50మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్ల లోనూ శ్రీజని పతకాలు ఖాతాలో వేసుకుంది. -హైదరాబాద్, ఆట ప్రతినిధి

ఫైనల్లో రష్మిక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరులో జరుగుతున్న ఐటీఎఫ్ మహిళల టెన్నిస్ టోర్నీలో రాష్ట్రానికి చెందిన శ్రీవల్లి రష్మిక ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో రష్మిక 6-2, 6-1తో లాల్న తరారుదీ(థాయ్‌లాండ్)పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన రష్మిక వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో చెలరేగుతూ వరుస పాయింట్లు దక్కించుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో జీల్ దేశాయ్‌తో రష్మిక తలపడుతుంది.

తన్మయ్ సెంచరీ

• జార్ఖండ్‌పై హైదరాబాద్ విజయం

జైపూర్: విజయ్ హజారే వన్డే టోర్నీలో హైదరాబాద్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. శనివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 17 పరుగుల తేడాతో జార్ఖండ్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(112) సెంచరీతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 297 పరుగులు చేసిం ది. రోహిత్‌రాయుడు త్వరగా నిష్క్రమించగా, కెప్టెన్ రాహుల్ సింగ్‌తో కలిసి తన్మయ్ ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. రెండో వికెట్‌కు వీరిద్దరు కలిసి 91 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన జార్ఖండ్ 8 వికెట్లకు 280 పరుగులకు పరిమితమైంది. సౌరభ్ తివారీ (78), ఆర్యమన్‌సేన్ (63), విశాల్ (61) అర్ధసెంచరీలతో రాణించారు. రోహిత్ రాయు డు(3/48), రవి తేజ(2/63) రాణించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.